క్లుప్తంగా

మండల పరిషత్ ఏఓగా శ్రీనివాసులు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులు

సి.బెళగల్: సి.బెళగల్ మండల పరిషత్ కార్యనిర్వాహక అధికారి (ఏఓ-సూపరిడెండ్)గా శ్రీనివాసులు నియామితులయ్యారు. డ్వామా జిల్లా కార్యాలయం నుంచి రెగ్యులర్ బదిలీలో భాగంగా మండలానికి ఏఓగా ఆయన వచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ సందీప్ నుంచి బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ జయప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ మంజుల తదితరులు ఆయనకు శుభాకాంక్షలతో స్వాగతం పలికారు.ఇప్పటి వరకు మండలంలో ఏఓగా ఉన్నకృష్ణమోహన్‌శర్మ డ్వామాకు బదిలీ అయ్యారు.

నేడు సుంకులమ్మ ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి రాధాకృష్ణ పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు దేవస్థానంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు ఉపాధ్యాయుల ఎంపిక

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ దస్తగిరిమ్మ, కరిమద్దెల ఎంపీపీ స్కూల్ ఎస్‌జీటీ నిర్మల జ్యోతిలు రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయుల పనితీరు మేరకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ-2 విమాలా వసుంధర దేవి శుక్రవారం తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు.

పంట నమోదు ఉంటేనే ప్రభుత్వ పథకాల వర్తింపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాఫ్ యాప్‌లో నమోదు చేయించుకుంటేనే రైతులకు ఉచిత పంటల బీమా, గిట్టుబాటు ధర తదితర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో శుక్రవారం ఏఓ రవిప్రకాష్ పర్యటించి పంట నమోదు కార్యక్రమంపై స్థానిక రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు ఏయే పంట సాగు చేసి వుంటే ఆ పంటను మాత్రమే ఆర్‌బీకే సిబ్బంది చేత ఈ-క్రాఫ్ యాప్‌లో సెప్టెంబర్ 15లోపు నమోదు చేయించుకోవాలని సూచించారు.

పింఛన్ అర్జీల పరిశీలన

కోడుమూరు రూరల్ : మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల వివరాలను ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 221మంది పింఛన్ అర్జీలకు సంబంధించి విచారణకు రావడం జరిగిందన్నారు. అన్నింటినీ పరిశీలించి అర్జీదారుల వివరాలను యాప్ లో నమోదు చేస్తామన్నారు. అర్హులందరికీ మరో రెండు రోజుల్లో ప్రభుత్వం కొత్త పింఛన్ల ను మంజూరు చేస్తుందని ఎంపీడీఓ పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

కల్లూరు: పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు సుధాకరప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్ నగర్‌లోని 81, 82వ వార్డు సచివాలయాల దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరలు భారీగా పెరిగాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కల్లూరు: నగర పరిధిలోని ఎల్ వెంకయ్య నగర్‌లో ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో జరిగే శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పోస్టర్లను నగర డిప్యూటీ మేయర్ రేణుక శుక్రవారం పెద్దపాడులో ఆవిష్కరించారు. కార్యక్రమం నిర్వాహకులు నాగయ్య, వాసు, వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీ కుట్రలను తిప్పికొడదాం

కల్లూరు: రాష్ట్రంలో టీడీపీ చేస్తున్న కుట్రలను తిప్పికొడదామని కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 26వ వార్డులోని కృష్ణానగర్‌లో వార్డు సచివాలయ కన్వీనర్ల, గృహసారథులతో స్థానిక కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి అధ్యక్షతన బీమా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

ఊరూరా పింఛన్ పండుగ

- తెల్లవారుజామునే ప్రారంభమైన పింఛన్ల పంపిణీ
- ఇంటి వద్దకెళ్లి అందజేసిన వలంటీర్లు
- కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లో పలువురికి కొత్త పింఛన్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేసిన నూతన లబ్ధిదారులు

పాణ్యం: నాలుగేళ్ల క్రితం పెన్షన్ మంజూరు కావాలంటే ఎన్నో వ్యయప్రయాసలు. దరఖాస్తు మొదలు మంజూరు వరకు ఇదే పరిస్థితి. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్ల మంజూరులో పూర్తి స్థాయిలో మార్పులు తీసుకువచ్చింది. సామాజిక పెన్షన్లకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న వెంటనే అర్హులని తెలితే చాలు మంజూరు చేస్తున్నారు. ఇందుకోసం ఎక్కడెక్కడో తిరగాల్సిన పని లేదు. ఇంటి సమీపంలోని సచివాలయంలో సంప్రదిస్తే చాలు. పెన్షన్ మంజూరవుతోంది. పార్టీలకు అతీతంగా పింఛన్లు ఇస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఇంటి వద్దకే పెన్షన్

ఇక పెన్షన్ పంపిణీలోనూ ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువచ్చింది. ప్రతినెల ఒకటో తేది ఉదయం ఇంటి వద్దకే వలంటీర్ వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేస్తున్నాడు. గతంలో రోజుల తరబడి పెన్షన్ తీసుకునేందుకు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎవరైనా పెన్షన్‌దారుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉంటే అక్కడికి వెళ్లి పెన్షన్లు అందిస్తున్నారు. కరోనాతో బయటకు వెళ్ల లేని పరిస్థితి ఉన్నప్పుడు సైతం వలంటీర్లు ఇంటి తలుపు తట్టి పెన్షన్ అందించారు. ఈప్రక్రియ నాలుగున్నరేళ్లుగా నిరాటకంగా కొనసాగుతుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇంటి వద్దకే పెన్షన్ వస్తుండటంతో పెన్షన్‌దారుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

పాత వాటితో పాటు కొత్త పింఛన్లు పంపిణీ

అవ్వతాతలు, వికలాంగులు తదితరుల సంక్షేమమే లక్ష్యంగా ఏడాదికి రెండుసార్లు ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేస్తోంది. దీంతో అవ్వతాతల్లో ఆనందం వెల్లువెత్తుతోంది. శుక్రవారం పాత వాటితో పాటు కొత్త పింఛన్లు కూడ గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి అందజేశారు.



పాణ్యంలో ధనియాల నారాయణమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మన్న

- పాణ్యం నియోజకవర్గంలో వివిధ రకాల పింఛన్లు మొత్తం 27, 378 ఉన్నాయి. కొత్తగా 591 మంజూరయ్యాయి. ఇందులో కల్లూరు మండలం 134, ఓర్వకల్లు 192, గడివేముల 131, పాణ్యం 134 పింఛన్లు ఉన్నాయి.
- పాణ్యం మండలంలో మొత్తం 6331 పింఛన్‌దారులుండగా తొలి రోజు శుక్రవారం 5,828 మందికి పింఛన్ సొమ్ము అందించారు.

కల్లూరు: మండలంలో మొత్తం 8,237 మంది పింఛన్ దారులు ఉండగా మొదటి రోజు 78శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. పెద్దటేకూరు గ్రామంలో కొత్త పింఛన్ దారుడు జి. చిన్న లక్ష్మన్నకు డీఆర్‌డీఏ పీడీ నాగశివ లీలా, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. మొదటి నెల పింఛన్ అందుకోవడంపై జి.చిన్న లక్ష్మన్న సంతోషం వ్యక్తం చేశారు. గతంలో పింఛన్ రావాలంటే అధికారుల చుట్టూ కాళ్లు అరిగేల తిరిగేవారమని చెప్పారు.



పెద్దటేకూరులో జి.చిన్న లక్ష్మన్నకు కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ నాగశివ లీలా, ఎంపీడీఓ రమణమూర్తి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి



ఓర్వకల్లు మండలం మీదివేములలో పింఛన్ అందజేస్తున్న వలంటీరు సురేష్‌నాయక్

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం తొలి రోజున 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 7,475 మంది పింఛన్‌దారులకుగాను మొదటి రోజున 6,985 మందికి అందజేసినట్లు తెలిపారు. ఇవిగాక కొత్తగా 342 పింఛన్లు మంజూరైనట్లు ప్రకటించారు. నాలుగైదు రోజుల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా కొత్త పింఛన్లు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

సి.బెళగల్: కోడుమూరు నియోజకవర్గంలో కొత్త పింఛన్లు 854 మంజూరయ్యాయి.ఇందులో కోడుమూరు 258, కర్నూలు రూరల్ 263, సి. బెళగల్ 162, గూడూరు 104, గూడూరు అర్బన్ 67 పింఛన్లు ఉన్నాయి. కాగా సి. బెళగల్ మండలంలో కొత్త పింఛన్లను ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు అందజేశారు. మండల కేంద్రం సి.బెళగల్ ఎస్సీ కాలనీలో నివాసముండే వృద్ధుడు పెమర రంగన్న మూడు రోజుల క్రితం పక్షవాతంతో కర్నూలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సి.బెళగల్ – 2 గ్రామ సచివాలయ వలంటీర్ దావీద్ శుక్రవారం తన సొంత ఖర్చులతో కర్నూలుకు వెళ్లి పింఛన్ కానుక అందజేశారు. ఆసుపత్రికి వచ్చి పింఛన్ ఇవ్వడంపై రంగన్న, ఆయన కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.



కర్నూలుఆసుపత్రిలో సి.బెళగల్‌కు చెందిన లబ్ధిదారుడు రంగన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దావీద్



గడివేముల సచివాలయం వద్ద దివ్యాంగురాలు ఎర్రోళ్ల చరితకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తుందని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు.శుక్రవారం స్థానిక సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లు అందజేశారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కార్యాలయాల చుట్టు తిరిగినా సంక్షేమపథకాలు అందేవి కాదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు.

- గడిగరేవుల గ్రామంలో సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఉశేన్ బాషా, భోగేశ్వరం ఆలయ చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్ కొత్త లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. దుర్వేశి గ్రామంలో సర్పంచ్ మండ్ల మమత ఆధ్వర్యంలో, తిరుపాడు గ్రామంలో సర్పంచ్ బాలలింగమ్మ, గని గ్రామంలో ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ కత్తి తులషమ్మ, ఉప సర్పంచ్ శివానందరెడ్డి ఆధ్వర్యంలో కొత్త పింఛన్లు అందజేశారు.

కర్నూలు (న్యూటౌన్): మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం వేగంగా సాగుతోంది. మండల పరిధిలో మొత్తం 10,146 పింఛన్లు ఉండగా శుక్రవారం ఒక్క రోజే 6,995 పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ అజాంఖాన్ తెలిపారు.

అభివృద్ధికి ప్రాధాన్యత

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- దూపాడులో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

కల్లూరు: నగరంలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 28వ వార్డు దూపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికే ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామని ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు. గ్రామస్తులు రోడ్లు, డ్రైనేజీ కాలువలతో పాటు పలు సమస్యలు ఎమ్మెల్యేకు తెలియజేయగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్నారన్నారు. పథకాల ఎంపికల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హతను ప్రామాణికంగా తీసుకుంటున్నారన్నారు. కరోనా మహమ్మరి ప్రభావంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేకునా పేదల అభ్యున్నతి కోసం పథకాలు కొనసాగించిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు పొందలంటే జన్మభూమి కమిటీల సిఫారసులతో పాటు నాయకుల అండదండలు ఉండాలన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని చెప్పారు. జనరంజక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరెడ్డి, శ్వేతారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, కేశవరెడ్డి, ఎ.హనుమంతు రెడ్డి, తిరుపాల్, ఎమ్.హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

గూడూరు: పట్టణంలో రూ.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పరి శీలించారు. కర్నూలు ఏడీఏ సాలిరెడ్డి, టెస్టింగ్ ఏఓ దస్తగిరి రెడ్డి, స్థానిక ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ల్యాబ్ పని తీరును వివరించారు. ఈ అగ్రి ల్యాబ్‌లో ఎరువులు, విత్తనాలు శ్యాంపుల్స్‌ను పరిశీలిస్తామని ఏడీఏ ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, కౌన్సిలర్లు ఖలీల్, మద్ది, కిషోర్, చనుగొండ్ల మహేశ్వరరెడ్డి, జూలకల్లు కాంతారెడ్డి, పుంచికలపాడు రాముడు, మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

- స్పందన అర్జీలను త్వరగా పరిష్కారించండి
- నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు

గడివేముల: ప్రజలు, రైతులు వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వస్తుంటారని, అధికారులు అందుబాటులో ఉండాలని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. మండల పరిధిలోని గని, కొర్రపోలూరు గ్రామాలలో శుక్రవారం ఆర్డీఓ పర్యటించారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన అర్జీలపై పరిష్కారంపై ఆరా తీశారు. కొర్రపోలూరులో నూతనంగా నిర్మించనున్న 220 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన పొలాలను పరిశీలించి వివిరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో మన దగ్గరికి వస్తారని, వారి సమస్యలను శ్రద్ధగావిని పరిష్కార మార్గాలు చూపాలని చెప్పారు. విధుల పట్ల అలసత్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్, మండల సర్వేయర్ శివ, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు హరిచంద్ర, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గనిలో పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

కొత్త పింఛన్ల మంజూరుపై పరిశీలన

ఓర్వకల్లు: ప్రభుత్వం మంజూరు చేసే కొత్త పింఛన్లపై శుక్రవారం డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల పరిశీలించారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఆమె క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. మండలంలో సుమారు 450 దరఖాస్తులు పంపగా అందులో మొదటి విడత కింద వివిధ కేటగిరీలలో 192 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ వివరించారు. మిగతా 250 దరఖాస్తులకుపైగా పునఃపరిశీలకు జిల్లా అధికారులు ఆదేశించారు. అందులో భాగంగా దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. పంఛన్‌కు అర్హత ఉందా? లేదా అనే వివరాలపై ఆరా తీశారు. అందులో మరో 150 పింఛన్‌దారులు అర్హులుగా గుర్తించినట్లు ఆమె ప్రకటించారు.

పసుపులలో పింఛన్ల వెరిఫికేషన్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం పసుపుల గ్రామంలో డీఆర్‌డీఏ పీడీ శివలీల పింఛన్ల వెరిఫికేషన్ చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి కొత్తగా మంజూరైన పింఛన్ల ధ్రువీకరణతో పాటు పంపిణీ వివరాలపై ఆరా తీశారు. సాయంత్రానికి 70.46 శాతం వైఎస్సార్ పింఛన్లు పంపిణీ పూర్తి చేయడంపై అధికారులను అభినందించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు రూరల్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. కె.నాగలాపురంలో కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను అందించి పేదల ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్నారన్నారు. కుల, మతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో పింఛన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి ఉండేదని, నేడు అర్హత ఉంటే చాలు మీ ఇంటి ముంగిటకే వస్తుందని గుర్తుచేశారు. చిత్తశుద్ధితో ప్రభుత్వం పేదలకు మేలు చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని, అసత్యారోపణలు చేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుగా నిలిచి మళ్లీ అధికారంలోకి తీసుకునివచ్చి జగన్ సీఎంగా చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ రాజమ్మ, సుందరం, సుబ్బన్న, లక్ష్మన్న, లావణ్య, అజీమున్నిసా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కె.నాగలాపురంలో లబ్ధిదారురాలికి పింఛన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

ఆర్‌బీకేను ప్రారంభించిన ఎమ్మెల్యే

మునగాలలో నూతనంగా నిర్మించిన ఆర్‌బీఏ భవనాన్ని ఎమ్మెల్యే సుధాకర్ ప్రారంభించారు. ఆర్‌బీకేలో రైతులకు అందించే పరికరాలు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు పంటల కొనుగోలు, మద్దతు ధర వంటివి కల్పించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారాన్ని అందిస్తున్నామన్నారు. పంట బీమా ప్రీమియం కూడా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని, రైతులకు సబ్సిడీలపై వ్యవసాయ పరికరాలను అందిస్తుందన్నారు. రైతులు ఆర్‌బీకేను వినియోగించుకుని ప్రభుత్వం అందించే పథకాలు, సబ్సిడీలను పొందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ మౌలాలి, సర్పంచ్ గోపాల్, గూడూరు నగరపంచాయతీ వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, రామాంజనేయులు, ఎంపీడీఓ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని కస్తూర్బా పాఠశాలను శుక్రవారం ఎంఈఓ జ్యోతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. అదేవిధంగా పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని ఎస్‌ఓను ఎంఈఓ ఆదేశించారు.

జగనన్న హయాంలోనే పేదల సంక్షేమం

ఓర్వకల్లు: రాష్ట్రంలో పేదల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందని జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాష అన్నారు. శుక్రవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలోని సచివాలయంలో బొడ్డువానిపల్లె, లొద్దిపల్లె, మీదివేముల గ్రామాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచు పుష్పమ్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో లోటర్‌బాష మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందుతున్నాయన్నారు. గత టీడీపీ హాయంలో నీరు చెట్టు పేరుతో ప్రభుత్వ నిధులను దోచుకున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కన్వీనర్లు, గృహసారథుల సౌలభ్యం కోసం ఉచిత బీమా సదుపాయం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు గంగాధర్‌రెడ్డి, పుష్పమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నాగశిరీష, నాయకులు నాగేంద్రారెడ్డి, లొద్దిపల్లె ప్రభాకర్‌రెడ్డి, మద్దిలేటి, జగన్‌మోహన్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ మృతి

సి.బెళగల్: కర్నూలు బళ్లారి చౌరస్తా సమీపంలోని దుర్గా లాడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీచైతన్య కళాశాల లెక్చరర్ వెంకటరాముడు (43) తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక అర్ధరాత్రి మృతి చెందాడు. సి.బెళగల్‌కు చెందిన ఈయన కృష్ణారెడ్డి నగర్‌లో నివాసముంటాడు. గురువారం రాత్రి బైక్‌పై బళ్లారి చౌరస్తా నుంచి ఇంటికి వెళ్తుండగా దుర్గా లాడ్జి సమీపంలో లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక అర్ధరాత్రి మృతిచెందాడు. భార్య సౌజన్యతో పాటు ఒక కూతురు సంతానం. తండ్రి రంగన్న ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి మార్చురీ కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లింపు

ఓర్వకల్లు: జాతీయ రహదారి 340బికి అవసరమైన భూములు కోల్పోయిన బాధిత రైతులకు శుక్రవారం పరిహారం చెక్కులను అందజేసినట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొమరోలు, సోమయాజులపల్లె రైతులకు స్థానిక పొదుపు భవనంలో నిర్వహించిన సమావేశంలో కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ బాధితుల జాబితాను పరిశీలించారు. వారికి హైవే అథారిటీ వారు మంజూరు చేసిన పరిహారం చెక్కులను అందజేశారు. అందులో కొమరోలు రైతులకు ఎకరాకు రూ.5 లక్షలు, సోమయాజులపల్లె రైతులకు రూ.14లక్షల చొప్పున ధరలు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.